# మానవరక్తం

బాబ్జీకి దేనికోసమూ ఎదురుచూసే అవసరం ఇంతవరకూ లేకపోయింది. కారణాలు చెప్పవలసి వస్తే ఎన్నో ఉన్నాయి గానీ, కొన్నయినా చెప్పక తప్పదు. అతను పుట్టినప్పటికి తాత లేకపోయినా ఆ ఇల్లు మాత్రం దివాన్ బహద్దూర్‌గారి ఇల్లుగానే చెలామణీ అవుతోంది. తండ్రి అప్పటికే లీడింగ్ క్రిమినల్ లాయరైపోయి, ఏది ముట్టుకున్నా ముత్యమై, పట్టుకుంటే బంగారమై లక్ష లార్జిస్తున్నాడు. అందుచేత బాబ్జీకి ఆకలి అంటే ఎలాంటిదో తెలీదు. విచారం అంటే ఏమిటో అంతకన్నా తెలీదు. ఒక హృదయవిదారకమైన దృశ్యం కానీ, కనీసం ఒక మనసును కరిగించే కథనైనా చదివే అవకాశం కానీ దొరకలేదు. అందుకే బాబ్జీ ముఖంలో సుఖంతోనూ, మోకాళ్ళలో బిగువుతోనూ ముద్దుగా ఈ పాతికేళ్ళూ పెరిగాడు.

ఇప్పుడు ఈ యాక్సిడెంటులో ఇరుక్కున్నాడు. అదీ తను కోరుకున్న అమ్మాయితో పెళ్ళి నిశ్చయం అయిపోయిన నెల రోజులనాడే ఈ అఘాయిత్యం జరిగింది. ఇదెలా జరిగింది అంటే చెప్పలేకపోతున్నాడు. కొత్త కాదు. అయినా ఇదివరకెన్ని కార్లు డ్రైవు చెయ్యలేదు? ఆసుపత్రి జనరల్ వార్డు బెడ్‌మీద తెలివి వచ్చేసరికి తల్లి, తండ్రి, కాబోయే మామగారు వగైరా ఎందరో నిల్చున్నా ఎవర్నీ సరిగ్గా పోల్చుకోలేకపోయాడు.

అన్ని సదుపాయాలున్న ఆసుపత్రి. ఎడమ కాలి ఎముక చిట్లింది. శరీర మంతా గాయాలు తగిలాయి. అదృష్టవంతుడు కాబట్టి తల ఎక్కడా చిట్లలేదు.

చూడవచ్చిన ఈ హైక్లాసు చుట్టాలకూ, మిత్రులకూ నచ్చనిది ఒక్కటే ఈ జనరల్ వార్డు. అందులో ఈ బెడ్ దొడ్డి, బాత్‌రూములకు దగ్గరలో ఉంది. ఒక ఫేను లేదు. పరుపులమీద సరైన దుప్పట్లు లేవు. నేలమీద చాపలు వేసుకుని వరండాలో కూడా అర్ధనగ్నంగా పేద పేషెంట్లు దొర్లుతున్నారు. ఉన్న స్పెషల్ వార్డులు తక్కువ. అప్పటికే వెయిటింగ్‌లిస్టులో ఏభై ఏడుగురున్నారు. ఎంత ఇన్‌ఫ్లుయెన్సు ఉపయోగించినా ఎవర్నీ ఇంత వేగిరం డిశ్చార్జి చేసే అవకాశం లేదు. ఇక ఎక్కడినుంచి చూసినా వేరే మార్గం కనపడలేదు. ఇలాంటి పేరు పడ్డ డాక్టర్లు మరే ఆసుపత్రిలోనూ లేరు. ఈ డాక్టర్లు ప్రవేటు ప్రాక్టీసు చెయ్యడానికి వీల్లేదు.

బాబ్జీ తండ్రికున్న పలుకుబడితో స్వంత దుప్పట్లు, ఫేను, ఒక రిద్దరు కాపలా మనుషులు ఉండడానికి అవకాశం కల్పించుకున్నారు. నిత్యం కస్తూరి అగరువత్తులు కంపు పోవడానికి వెలిగిస్తున్నారు. నిద్రపోడానికి మత్తుమందు ఇవ్వటం వల్ల గాయాల బాధ అంతగా లేదు. ఇంకా కాలు ఆపరేషను చెయ్యాలి. ఇనుపకడ్డీ వేశాక ఓ రెండు మూడు నెలలు కదలకుండా ఉండాలి.

"అన్నాళ్ళూ ఇక్కడే ఈ బెడ్‌మీదేనా?" అన్నాడు బాబ్జీ తండ్రితో.

తండ్రి జగదీశ్వరరావు, ఇదివరలానే పెద్ద గొంతుతోనే ఇంగ్లీషులో "డోంట్ వర్రీ మై సన్ - వుయ్ విల్ లుక్ ఆఫ్టర్ యువర్ కంఫర్ట్" అన్నాడు.

"ఆపరేషను అయిన వారం రోజులనాడు ఇంటికి వచ్చేద్దువుగాని నాయనా! అవసరమైతే అంబులెన్సులో తెచ్చి డాక్టరుకు చూపిస్తాంతే" అని తల్లి నెమ్మదిగా చెప్పింది.

ఆపరేషనుకు రెండు రోజు లుండగా జ్వరం తగ్గింది. తనమీద తనకు సరైన స్పృహ రాగానే కాబోయే ఇల్లాలు జ్ఞప్తికి వచ్చింది. తన కొత్త మారుతి ఎర్రకారు మీది మమకారం కాసేపు వేధించింది. వంటపుట్టి చెయ్యి కాల్చు కున్నట్లు, డ్రైవింగ్‌లో పందానికైనా సిద్ధమైన తను ఎలా కంట్రోలు తప్పాడు? వాడు చప్పున తొండలా పరుగెత్తి అడ్డు పడిపోయాడు. ఉత్తి పల్లెటూరి బ్రూట్!

తండ్రి అన్నాడు- "యూ డోంట్ వర్రీ మై సన్ - వుయ్ విల్ ప్రూవ్ యువర్ ఇన్నోసెన్స్ - నథింగ్ విల్ హేపెన్ టు యు - దిస్ టైమ్ యు కెన్ డ్రయివ్ స్టాండర్డ్ 2000"

తనను రక్షించగలిగే స్తోమత ఉన్న తండ్రి, తన సుఖంకోసం ఏమైనా చెయ్య సిద్ధంగా ఉన్న కాబోయే మామగారు, అభిమానాన్ని ఈ కష్టకాలంలో కుప్పలు తెప్పలుగా కురిపిస్తున్న రెండువేపులా ఉన్న బంధువర్గం, మిత్రవర్గం-

ఇంకేం కావాలి? ఈ అభిమానాలు చూపించడానికి వాళ్ళు తెచ్చే పళ్ళు, కేరియర్స్‌లో రకరకాల భోజనాలు- ఒక టేమిటి?అసలు తను ఆసుపత్రిలో జనరల్ వార్డులో ఒక మూల కంపు వాతావరణంలో ఉన్నాననే మరచిపోయాడు.

నాలుగు పూటలు తిండి పడ్డాక, తనకు నిత్యం కాపలా ఉన్నవాళ్ళు కాస్త సినీమాకనీ, ఏదో పనిమీదా వెళ్తుంటే, ఒంటరిగా ఉన్న క్షణాల్లో ఒకసారి చుట్టూ చూశాడు. తన మంచం ఎదరగా తనలాగే మంచం దిగలేని ఒక వ్యక్తి ఉన్నాడు. బాబ్జీ వచ్చేసరికి ఆ వ్యక్తి అక్కడున్నా ఈనాటికి వాడివేపు బాబ్జీ చూశాడు. వాడి పక్కనే ఒక ముసలమ్మ నిల్చొని ఉంది. పల్లెటూరి మనిషి. వయసుకన్నా కష్టాలే కండలు కరిగించాయేమో- ఎండిన ఛాతీ, ఎముకలన్నీ లెక్కపెట్టవచ్చు న్నట్లు కనిపిస్తున్నాయ్.

"ఏ మామ్మా, ఇంద. ఈ ఇంజక్షను కొనుక్కునిరా" అని నర్సు ఒక కాగితం అందించింది.

"తెచ్చిన ఇరవై రూపాయలు అయిపోయినాయి తల్లీ! ఎక్కడి నుంచి తేను?" అని నెమ్మదిగా అంటే- ఆ నర్సమ్మ "ఎక్కడనుంచి ఎలా తెస్తావో" అంది.

"ధర్మాసుపత్రి కదమ్మా - పేదారోదామీద కనికారం చూపించు తల్లీ!"

"ఓ- బోల్డు కనికారం ఉంది లేని మందు నేనెక్కడినుంచి తెస్తాను?" అంటూ వెళ్ళిపోయింది నర్సు.

అలా నిల్చుండిపోయిన తల్లివేపు చూసి చేసేదిలేక కొడుకు కళ్ళు మూసు కున్నాడు. తొలిసారి కన్ను రెప్ప వెయ్యకుండా బాబ్జీ ఆ ముసలమ్మవేపు చూస్తు న్నాడు. కొడుకు వేపూ, చీటీవేపూ చూసుకుని కాస్సేపయ్యాక బాబ్జీ దగ్గరకు వచ్చి-"బాబూ....ఈ మందెంతవుతాది?" అనడిగిందా ముసలమ్మ.

"మందుల షాపువాడిని అడిగితే తెలుస్తుంది."

"ఈ దబ్బుకు వస్తాదా?" అని కొంగులో కట్టిన చిల్లరంతా చూపించింది.

"ఆ నర్సమ్మకు చూపించి అడుగు- సరిపోతుందో లేదో!"

"ఆయమ్మ నడిగితే నా మాట నమ్మదు. మందులకొట్టు కెళ్తాను. ఈ సిల్లరతో యిండిషను వస్తే డబ్బులు నివ్విచ్చినావంటాను. నిన్నడిగితే ఔనను బాబూ. నేకపోతే నా మాట పొల్లయిపోతాది" అని ఆ తల్లి బయటకు వెళ్ళింది. తిరిగి వచ్చి "పది పైసాలు తక్కువ. ఆ బాబు పోనీలే అని యిండిషను యిచ్చి నాడు" అని చెప్తుంటే అంతవరకు ఆలోచిస్తున్న బాబ్జీ- "ఏమైంది నీ కొడుక్కి!" అని అడిగాడు.

"కొబ్బరికాయలు దించడానికి కూలి కెళ్ళినాడు. సెట్టుమీదనించి పడి పోనాడు. అప్పటికప్పుడు బండిమీద యేసుకుని ఈ ధర్మాసుపత్రికి తెచ్చేసినాను."

"ఎంతమంది పిల్లలు?"

"ఈడికా? ఇద్దరాడోలు-యిద్దరు మొగోలు. అంతా సిన్నోలే. ఆ పిల్లల్ని సూసుకుని కోడలు మా వూర్లో వున్నాది. కూలీనాలీ సేసుకోకపోతే ఆ పిల్లల్ని యేటెట్టి పోసిస్తాది? వస్తాను బాబూ!" అంటూ నర్సమ్మ దగ్గర కెళ్ళింది.

రాత్రయినా బాబ్జీకి నిద్దర రాలేదు. ఎదరగా ఆ మంచం, దానిమీద వ్యక్తి, ఆ పక్కన కటికనేలమీద దొర్లుతున్న ఆ ముసలమ్మ-కళ్ళు మూస్తే ఆ దృశ్యమే కనిపిస్తోంది. ఎప్పుడు నిద్దర పట్టిందో ఉదయమే తెలివి వచ్చింది. తనకు కాపలా ఉన్న మిత్రుడు ఇంకా నిద్దరపోతున్నాడు.

ఆ ముసలమ్మ తను లేవటం చూసి గబగబా దగ్గరగా వచ్చి- "బాబూ, నిన్నటి నుంచి కొడుక్కి తిండిలేదు. ఒక రూపాయి యిస్తావా బాబూ?" అంది.

"ఆసుపత్రివాళ్ళు భోజనం ఇవ్వటంలేదా?"

"లేదు బాబూ! అదేదో తప్పు రాసేసినారట. మరి రెండు రోజులు పోతే ఆడికి తిండి దొరికితే దొరుకుతాడట"

"మరి నీకో?"

"నాకు అలవాటే - ఏదీ నేకపోతే మంచి నీటికి కరువు నేదుకదా?"

మిత్రుణ్ణి లేపి బాబ్జీ రూపాయి ఇప్పించాడు.

కాస్సేపయ్యాక బయట నుంచి ఇడ్లీ కొనుక్కొచ్చి ముందు కొడుక్కి తినిపిస్తోంది. వాడే బలవంతంగా రెండో ఇడ్లీలో ముక్కను తల్లికి తినిపించాడు.

అంతా అయ్యాక వచ్చి "నీ దర్మాన యిద్దరి కడుపులు నిండాయి బాబూ!" అంది.

"రెండు ఇడ్లీలతో ఇద్దరి కడుపులు నిండిపోయాయా?"

"అమాత్రం యిక్కడ తిన్నాం. ఊర్లో నలుగురు పిల్లలు తిండిలేక, యెలా గిజగిజ గింజుకుంటున్నారో? నా కొడుకు మాకష్టాజీవి బాబూ! ఆడికి పనంటే రాత్రీ పగలూ ఒక్కటే. ఇంత తెచ్చి యింట్లో పోసి, ముందు పిల్లల కెట్టు అనే వోడు. అలాంటి నా కొడుకు కాలుసేతులు యిరిగిపోనాయి. ఇది గెహచారం కాకపోతే మరేటి? ఆ పిల్లలదృష్టం, దేముడు కనికరించి పేణాలతో వుంచినాడు."

ఆవేళ మధ్యాహ్నం తను సగమే తిని, మిగతా సగం మామ్మను పిలిచి "నువ్వూ - నీ కొడుకూ తినండి" అన్నాడు.

మాంసంకూర, పళ్ళున్న పాయసం. ఎన్నడూ ఎరుగని రుచులు. వాళ్ళిద్దరూ తినే తీరూ, పొందిన తృప్తీ చూస్తుంటే, ఇంతకుముందు తను ఈ తిండే తిన్నప్పుడు అలా ఎందుకు తృప్తిగా తినలేకపోయాడు అనిపించింది.

రాత్రి భోజనానికి కూడా వాళ్ళు వెతుక్కోకూడదని అనిపించింది బాబ్జీకి. ఇతనికి తిండి సహించలేదని ఎలా తెలిసిందో, కేరియర్ విప్పితే సగానికి సగం

ఉంది. ఈ ఒక్క సంఘటనతో మనుషులు చెప్పినదానికి, చేసినదానికి తేడా స్ఫురించి తలకాయలో తేళ్ళుదూరి కుట్టినట్లనిపించింది.

పర్యవసానం - అపరేషను అయినాక విషాన్ని విషం ఛేదించినట్లు ఆలోచనలు మారిపోయాయి. మనిషి మాటాడలేదు. తినటంలేదు. కళ్ళు మూసుకుంటే నిజాలు కళ్ళ ఎదుట ప్రత్యక్షమౌతున్నాయ్. తెలివి వచ్చినా ఎవరేం అడిగినా ఏమీ చెప్పలేదు. విచారంతో కృంగిపోయిన వాడిలా ఉన్నాడు. తండ్రి, తల్లీ, కాబోయే మామగారు, పెద్దలు, చుట్టాలు, ఎందరెందరో ధైర్యమైన కబుర్లు చెప్తున్నారు.

"ఆపరేషన్ మోస్టు సక్సెస్‌ఫుల్."

"నథింగ్ టు వర్రీ - మూడు నెలల్లో నిన్ను పరుగెత్తిస్తాడట డాక్టరు."

"ఏపిలు పండ్లు స్వంతంగా కోశాను తిను నాయనా!" తల్లి.

"భోజనం నేను స్వయంగా వండానండీ!" కాబోయే భార్య.

"ఏమైనా పీడకలలు వస్తున్నాయిరా! ఎందుకిలా ఉన్నావు బాబూ?"

"పుట్టిన దగ్గరనుంచీ కష్టం ఎలాంటిదో ఎరగవు. ఇప్పుడిలా వచ్చింది. మాయ కాకపోతే ఇంకేమిటి?" కన్నీళ్ళు తెచ్చుకుంది తల్లి.

"ఏదో తల్చుకుని బాధపడుతున్నట్లున్నాడు. అదేదో తెలుసుకుని కాస్త తినేటట్లు చూడండి" అన్నాడు డాక్టరు లాయరుగార్ని పక్కకు పిలిచి.

ఎంత ప్రయత్నించినా మిటుకూ మిటుకూ చూస్తాడు గానీ కారణం చెప్పడే.

"బాబు తిండిలేక చిక్కిపోతున్నాడు. ఆ బాధ ఏదో తెలుసుకోగలిగితే...."

"వాడు బాధపడ్డానికి ఏం తక్కువ చేశామే?"

సాయంత్రం తన ఎదరగా తల్లీ తండ్రీ ఇలా మాటాడుకుంటే ఎదరగా ముసలమ్మ వచ్చింది.

"ఇటెందుకు వస్తున్నావ్? వెళ్ళు వెళ్ళు." కసిరింది బాబ్జీ తల్లి మనోరమ.

"మాకు పేణంపోసిన బాబు, ఏదీ తినకండా తన పేణంమీదకు తెచ్చుకుంటాడా? ఏటయినాదో యాదో కనుక్కోనీయమ్మా!'' అని చొరవ చేసుకుని ముందుకెళ్ళి బాబ్జీ మీద చెయ్యి వెయ్యగానే ఒక్కసారి ఆ ముఖంలో నవ్వు వికసించింది.

"ఏదైనా కలగన్నావా బాబూ? ఇక్కడ భూతపిశాచులున్న జాగా కదా...."

"అవును మామ్మా .... కలగన్నాను."

"ఎవరు కనిపించారు బాబూ?"

"నా కారు కిందపడి చచ్చినమనిషి ...."

"అడికి అయుర్దాయం సరి. సచ్చినాడు. సచ్చినోడు సచ్చినట్టుండక నీలాంటి మంచి బాబు మీదకి వస్తాతా? ఉంచు బాబూ! మా వూరెళ్ళి బూత వైదిగుడ్ని తెస్తాను."

"చచ్చినవాడి గురించి కాదు. వాడికీ ఒక పెళ్ళాం - పిల్లలూ ఉంటారుకద మామ్మా .... వాళ్ళూ నీ మనవడూ, మనవరాళ్ళలా తిండిలేక ఏడుస్తుంటారు కద మామ్మా ...."

"కనికరం ఉన్న మనిషివి. ఆ ఆలోచన అందుకే నీకు పుట్టింది."

ఇది విన్న తండ్రి చప్పున ముందుకు వచ్చి - "డోంట్ వర్రీమై సన్ - వుయ్ విల్ లుక్ ఆఫ్టర్."

"ఏం చూస్తారు? అ ఊరెళ్ళారా? ఆ పిల్లల్ని చూశారా?"

"నీ పొరపాటేం లేదు కదరా? వాడే తాగి నీ కారుకింద పడ్డాడు" అని తల్లి అంటే—

"పొరపాటు లేదు?" అంటూ చప్పున తలెత్తి బాబ్జీ అరుస్తున్నాడు.

"నా చిన్నప్పటి నుంచీ నా చుట్టూ ఉన్న లోకాన్ని చూడకుండా కళ్ళు కప్పారు. అన్నిటికీ 'డోంట్ వర్రీ' అనేసి నా ఆలోచనలను పీల్చేశారు. ఆకలి తెలుసుకుని, బాధలు పంచుకుని అసలైన జీవితం జీవించకుండా చేశారు. అంతా నాకోసం సమకూర్చి నన్నొక గుడ్డివాణ్ణి, కుంటివాడికన్న ఆధ్వాన్నంగా తయారు చేశారు.

అప్పటికే డాక్టర్లు. నర్సులు, కదలగలిగే వాళ్ళందరూ చుట్టూ మూగిపోతే - ఎత్తగలిగిన రెండు చేతులూ ఎత్తి జోడిస్తూ- "నా చుట్టూ ఇంత మంది కష్టార్జితం చాలక ఆకలితో బాధపడుతుంటే - వేటాడే తండ్రి సొత్తు తిని సోమరినైన నా మీదే మీ అందరికీ ఎందుకీ ధ్యాస? ఇంత మంది ఆకలితో అలమటించిపోతుంటే - ఆకలి లేని నా నోట ఎందుకిలా కుక్కుతున్నారు? ఛీ .... నాకు ఈ సమాజం చూస్తుంటే వాంతి వస్తోంది ...."

నీరసంతో చేరబడిపోయాడు. నిశ్శబ్దం-రెండు కళ్ళలో నీరు కారిపోతోంది. నీరు ఎంత కారినా కారిపోనీ అన్నట్లు తుడవలేదు. కాసేపయ్యాక తనలో ఇన్నాళ్ళకు కాస్త మానవ రక్తం ప్రవహిస్తున్నట్లు అనిపించి కళ్ళు మూసుకున్నాడు. *

(1987)